క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన చీరాల నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శీలం చంటి, పేర్లి నాని

చీరాల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ చీరాల నాయకులు శీలం చంటి, పేర్లి నాని పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విషయాల గురించి వివరించారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, ప్రస్తుత పన్నుల వసూళ్లు వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇంటి పన్నులపై ఎంపీడీఓ సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 15 గ్రామాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇంటి పన్నుల వసూళ్లు చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లల్లో అలసత్వం వహించరాదన్నారు. గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. రోజువారీగా పారిశుధ్య సమస్యలను లేకుండా చేయాలన్నారు. పంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటి పన్నుల బకాయిలను త్వరగా వసూళ్లు చేయాలన్నారు. పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు శ్రద్ధగా పని చేయాలన్నారు. ఈఓఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు, తదితరులున్నారు.

మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



బొల్లాపల్లిలో రైతు శిక్షణలో పాల్గొన్న అధికారులు, రైతులు

మార్టూరు: మండలంలో మామిడి తోటలు సాగు చేసే రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి బి. హనుమంతు నాయక్ అన్నారు. మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో గురువారం మామిడి తోటలను పరిశీలించిన ఆయన స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. గత డిసెంబరు నెలలో వచ్చిన తుఫాను వాతావరణ కారణంగా మన ప్రాంతంలో మామిడి పూత రావటం తగ్గిందని తెలిపారు. ప్రస్తుతం బూడిద తెగులు సోకి పూత, పిందే రాలిపోయే అవకాశం ఉన్నందున రైతులు నివారణకు కేరాదిన్ గోల్డ్‌తో పాటు క్యాల్షియం, సివిడ్లను కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మామిడి చెట్లపై రసం పీల్చే పురుగుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు పోషక విలువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్ కన్సల్టెంట్ కె. విష్ణుమూర్తి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన



వెలుగు కార్యాలయంలో సమావేశంలో మహిళా సమాఖ్య సభ్యులు

పర్చూరు(చినగంజాం): స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సభ్యుల సమావేశం గురువారం ఏపీఎం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధికారి చిన్నయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసిన వాటిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు బ్యాంకు నుంచి ఇచ్చే రుణాల గురించి చిన్న, సన్న కారు రైతులకు అవగాహన కలిగించారు. 50 శాతం సబ్సిడీతో లభించే షినెట్ గురించి వివరించారు. అధికారులు రవీంద్ర బాబు, రవికుమార్, బీటీడీ సభ్యులు, పీజీ సభ్యులు, సీసీలు ప్రమీల, శ్రీనివాసులు, విజయకుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం ప్రత్యేక రిసెప్షన్

జె.పంగులూరు: సమస్యలతో వచ్చిన మహిళలకు సత్వర న్యాయం జరిగేందుకు రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక మహిళా డెస్క్ ఏర్పాటు చసినట్లు ఎస్సై బి. వినోద్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు.

కోలలపూడిలో ఆగని విధ్వంసకాండ

- మాజీ ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పేరు ధ్వంసం చేసే యత్నం

మార్టూరు: మండలం కోలలపూడి గ్రామంలో అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. స్థానిక బీసీ వర్గానికి చెందిన వేల్పుల ఆంజనేయులు ఇంటి పరిసరాలను మురుగునీటి పారుదల సాకుతో బుధవారం అధికారులు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా గురువారం ఉదయం మరో అరాచకానికి తెరతీయటం గమనార్హం. గ్రామ నడిబొడ్డులో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం ముఖద్వారంపై చెక్కిన మాజీ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సాధినేని హనుమంతరావు పేరును తొలగించేందుకు నాయకులు బరితెగించారు. 2014–19 సంవత్సరాల మధ్య కాలంలో వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసిన సాధినేని హనుమంతరావు గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు చెన్నకేశవస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. చైర్మన్ గా తన పాలనా హయాంలో హనుమంతరావు 10 లక్షల రూపాయలు తన సొంత నిధులు వెచ్చించి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఆలయంలో గ్రామస్తులు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అవసరమైన షెడ్డు ఏర్పాటు చేసి ఆలయ ముఖద్వారం నిర్మించి పైభాగాన విష్ణుమూర్తి శేష పాన్పుతో సహా ముఖ ద్వారానికి ఇరువైపులా ఆంజనేయుడు, గరుత్మంతుల విగ్రహాలను ఏర్పాటు చేసి రంగుల తో అందంగా తీర్చిదిద్దారు. వీటి నిర్మాణ దాతగా ఆలయ ముఖద్వారంపై ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సాదినేని హనుమంతరావు తన పేరు సిమెంట్ అక్షరాలతో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గ్రామంలోని ఓ వ్యక్తి ఆలయ ముఖద్వారం పై ఉన్న హనుమంతరావు పేరు గల అక్షరాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తూ రెండు అక్షరాలను తొలగించాడు కూడా. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని ఆలయం వద్దకు వెళ్లిన హనుమంతరావు ఆ వ్యక్తిని ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించాడు. స్థానిక టీడీపీ నాయకులు కందిమళ్ళ చందు, కందిమళ్ల చిన్నా అనేవారు తొలగించమని ఆదేశిస్తే తాను తొలగిస్తున్నట్లు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ సమీపంలోనే ఉన్న టీడీపీ నాయకులు చందు చిన్నాలను హనుమంతరావు తన పేరును ఎందుకు ధ్వంసం చేస్తున్నారని ప్రశ్నించారు. అందుకు చిన్నా మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం ఏం చేసుకుంటావో చేసుకో నీ పేరు తొలగిస్తాం అంటూ బెదిరించి వెళ్లినట్లు హనుమంతరావు తెలిపారు. గ్రామస్తులు అందరికీ అవసరమైన దేవాలయాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసిన వ్యక్తులపై ఇలాంటి దౌర్జన్యం సరికాదని గ్రామస్తులు భావిస్తున్నారు.



చెన్నకేశవ స్వామి ఆలయ ముఖద్వారాన్ని చూపుతున్న సాదినేని హనుమంతరావు

> **ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం**
> కోలలపూడి గ్రామ చెన్నకేశవ స్వామి ఆలయ ముఖద్వార పై భాగంలో పేర్లు తొలగిస్తున్న విషయం తెలిసింది. వెంటనే ఆదేశించి నిలిపి వేయించాను. అనుమతులు లేకుండా ఆలయానికి సంబంధించి ఎలాంటి చర్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
> – టి. శిరీష, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

> **ఆలయాన్ని అభివృద్ధి చేయడమే తప్పా?**
> గ్రామంలో అందరికీ ఉపయోగపడటం కోసం 10 లక్షల రూపాయల సొంత నిధులు వ్యయం చేసి ఆలయాన్ని అభివృద్ధి చేశాను. టీడీపీ నాయకులు కందిమళ్ల చందు, కందిమళ్ళ చిన్నాలు దగ్గరుండి ముఖద్వారం పై ఉన్న నా పేరును ధ్వంసం చేయడం దారుణం. దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.
> – సాదినేని హనుమంతరావు, ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్

మోసపూరిత వాగ్దానాలతో అధికారం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో అంతకు రెట్టింపు చర్యలు తీసుకుంటామన్నారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా నేరవేర్చలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ప్రశ్నిస్తాను అనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎవరి ప్రశ్నిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తానేమీ చేయటంలేదంటూ.. వెనుక ఉండి ఇసుక, మట్టి, గ్రానైట్ మాఫియా నడిపిస్తున్నారన్నారు. కూటమి నాయకుల దోపిడీని ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 2 లక్షల మందికి పింఛన్లు తొలగించారని తెలిపారు. అధికారులు కూటమి నాయకుల తొత్తులుగా మారారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సంతమాగులూరు. బల్లికురవ, కొరిశపాడు, పంగులూరు మండల కన్వీనర్లు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మురహరి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గుప్త, పరిమి ప్రసాద్, సర్పంచ్ నగేష్, వార్డు కౌన్సిలర్‌లు గుంజి కోటేశ్వరరావు, జబ్బార్, కొల్లా భువనేశ్వరి, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పురాతన అతహర్ మసీదు కూల్చివేతకు నిర్ణయం



పర్చూరులో అతహర్ మసీదు (ఫైల్)



కూల్చివేస్తున్న దృశ్యం

- తొలగింపు పనులు ప్రారంభం
- రూ. 1 కోటితో కొత్త మసీదు నిర్మాణానికి సన్నాహాలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో అతి పురాతనమైన అతహర్ మసీదును కూల్చివేసేందుకు మసీదు అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. 100 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ మసీదు బలహీన పడటంతో ప్రార్థనలు చేసుకునేందుకు ఇబ్బంది కలుగుతుండటంతో తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. గురువారం తొలగింపు పనులు చేపట్టారు. దీని స్థానంలో రూ.1 కోటితో కొత్త మసీదు నిర్మించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు షేక్ అహ్మద్‌బాషా తెలిపారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నూతనంగా నిర్మించే మసీదులో ఒకేసారి 400 మంది ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మసీదు నిర్మాణానికి సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ ప్రభాకరరావును సత్కరిస్తున్న రాష్ట్ర ఐక్యవేదిక సభ్యులు, విద్యార్థినులు

చినగంజాం: ఉత్తమ తహసీల్దార్‌గా గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ జె. వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జీవిగుంట ప్రభాకరరావును ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీస్ రాష్ట్ర ఐక్య వేదిక సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. చినగంజాం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పూల బొకే అందజేసి అభినందన పత్రం, మెమెంటో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభాకరరావు వివిధ హోదాల్లో ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రాలను ఇప్పటి వరకు ఏడుసార్లు అందుకున్నారని అభినందనీయమన్నారు. తాను ఎక్కడ విధులు నిర్వహించినా పేదల అధికారిగా పేరు తెచ్చుకొని, నీతి, నిజాయితీతో ఉత్తమ సేవలందిస్తూ అందరి అభిమానాన్ని చురగొన్నారని భవిష్యత్‌లో ప్రజలకు మరిన్ని మంచి సేవలందించి మరిన్ని ఉత్తమ అవార్డులు అందుకోవాలన్నారు. ఐక్యవేదిక రెండు జిల్లాల అధ్యక్షుడు జగన్నాథం, యోహాను, విస్తర్ల వెంకట సుబ్బారావు, సభ్యులు, మదర్సా ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్, అద్దంకిలోని చైతన్య బధిరుల పాఠశాల చైర్మన్ పూనూరి ఆరోగ్యం, పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్ర బాబు, మధిర పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్ర నిర్మాణానికి రూ. 50,232 విరాళం



ట్రస్టు నిర్వాహకుడు మహాలక్ష్మికి నగదు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: శ్రీశైలంలోని భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన వసతి గదుల సత్ర నిర్మాణానికి విరాళాలు అందాయి. ఎన్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గాజుల యల్లమంద ప్రసాద్ రూ. 25,116, బొందలపాటి నాగ శంకరరెడ్డి రూ. 25,116 మొత్తం రూ. 50,232 విరాళం అందించి తమ భక్తిని చాటుకున్నారు. స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో గురువారం జరిగిన కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎంవీఎస్ మహాలక్ష్మికి వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మహాలక్ష్మి మాట్లాడారు. తమ వినతిని మన్నించిన వాకర్స్ సభ్యులు సహృదయంతో విరాళాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గతవారంలో కూడా ముగ్గురు వాకింగ్ దాతలు రూ. 75,000 అందజేశారని చెప్పారు. సత్రాల నిర్మాణానికి మరికొంత నగదు కావాల్సి ఉందని దాతలు సహృదయంతో ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం సహకారం అందించిన వారికి ట్రస్టు తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, గుద్దంటి రమేష్, చెక్క చెన్నానారాయణ, వంగర పూర్ణచంద్రరావు, బాల గంగాధరరావు వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

- మున్సిపల్ చైర్మన్ జైసన్‌బాబును అవమానపరచడం దారుణం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు

చీరాల రూరల్: టీడీపీ నాయకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు గురువారం డిమాండ్ చేశారు. మాజీ మంత్రి పాలేటి రామారావు ఆహ్వానం మేరకు ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు భూమిపూజ కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌మున్సిపల్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు వెళ్లారని, అంతమాత్రంగానే విగ్రహం మైలపడిందంటూ టీడీపీ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం ఆయనను కులం పేరుతో అవమానించడమేనన్నారు. అది ఒక్క జైసన్‌బాబును అవమానించం కాదని ఆయన పట్టణ ప్రథమ పౌరుడని, పట్టణ పౌరులతో పాటు యావత్ దళిత జాతిని అవమానపరచడంగా భావిస్తున్నామన్నారు.

గురువారం రామకృష్ణాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ఆదేశాలతో పట్టణ అధ్యక్షుడు మేరిబాబు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. యాతం మేరిబాబు, వాసిమళ్ల వాసు, పార్టీ ఇంటలెక్టువల్ ఫోరం అధ్యక్షుడు తేళ్ల రాంబాబు, సంగుల జాన్ చిరంజీవి, పార్టీ రైతు విభాగం రమణారెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు ఉమ్మిట్టి శివ, మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ అల్లా భక్షు మాట్లాడారు. పట్టణంలోని అభివృద్ధిపై దృష్టిసారించకుండా పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఎన్‌టీఆర్ విగ్రహంపై తెలుగు దేశం పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే వర్గాలు ఒకరిపై ఒకరు చేసుకుంటున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ జైసన్‌బాబు మాజీ విగ్రహ భూమిపూజ కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టడంతో మైలపడిందని పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు రజనీ తమ అనుచరులతో విగ్రహం ఏర్పాటు వద్ద పసుపునీళ్లతో శుద్ధి చేయడం ఏమిటని ప్రశ్నించారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును ఇదే విధంగా అగౌరవపరచి మాట్లాడారని వారిరువురికి టీడీపీ శ్రేణులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వర్గమైన మల్లెల బుల్లిబాబు మరికొందరు నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ, టీడీపీలు కుమ్మక్కు రాజకీయాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి పార్టీలకు, రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా జనరంజక పాలన చేపట్టారని, ప్రస్తుత ఎమ్మెల్యే మాత్రం అభివృద్ధిని మరచి వర్గ వైషమ్యాలపై దృష్టి సారించినట్లుందని ఎద్దేవా చేశారు. గవిని శ్రీనివాసరావు, కోండ్ర పూర్ణా, తేళ్ల రాంబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్త

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యులు పావని సూచించారు. గురువారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను చైతన్యం చేయాలి

యద్దనపూడి: గృహ నిర్మాణ లబ్ధిదారులను చైతన్యవంతులను చేసి గృహనిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని ఎంపీడీఓ పి. లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని యనమదల సచివాలయంలో గురువారం పీఎంజీఓ ఇంటింటి సర్వే, ఐహెచ్‌హెచ్ఎల్‌పై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన చింతపల్లిపాడు చెరువును సందర్శించి పరిశీలించారు.

సామగ్రి స్వాధీనం

చీరాల:

సరైన పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న సామగ్రిని గురువారం రాత్రి ఈపురుపాలెం రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. ఈపూరుపాలెంలోని విజయలక్ష్మి థియేటర్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. చీరాల నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారు డిక్కీలో పూజకు ఉపయోగించే దీపారాధన కుందులు, ఐరన్ బాక్స్, లేడీస్ డ్రస్ ఐటమ్స్, నైటీలు, బ్లౌజులు, బెడ్ షీట్స్, రోల్డ్ గోల్డ్ ఆర్నమెంట్స్, ఇత్తడిపోత కలిగిన స్టీలు ప్లేట్లు ఉన్నాయి. అయితే వాటికి సంబంధించిన సరైన బిల్లులు లేకపోవడంతో అవి దొంగవస్తువులుగా గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన కారులో ముగ్గురు మహిళలు, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధికి పాటు పడండి



సీనరేజ్ పంపిణీ విషయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

బల్లికురవ: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు వివాదాలు విడనాడి సమన్వయంతో అభివృద్ధికి పాటు పడాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరావు కోరారు. గురువారం పాతమల్లాయపాలెం గ్రామ సచివాలయంతో సీనరేజ్ పంపిణీపై 4 పంచాయితీల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ గ్రానైట్ ఎగుమతుల్లో ప్రభుత్వానికి చెల్లించే సీనరేజ్ లో కొణిదెన, నక్కబొక్కలపాడు, పాతమల్లాయపాలెం, కె.రాజుపాలెం, పంచాయితీలు వాటాల ప్రకారం కేటాయిస్తున్నారు. ఇటీవల కాలంలో వాటాల పంపిణీలో సర్పంచ్‌లు కోర్టుకు ఎక్కటంతో రూ. 1.4 కోట్ల నిధులు ఖర్చు చేయకుండా కోర్టు ఉత్తర్వులతో నిలిచిపోయాయి. ఈ విషయమై 4 పంచాయతీ సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటుచేసినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఎవరివారు తమకు ఎక్కువ మొత్తంలో పర్సంటేజ్ కావాలని కోరటంతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని డీపీవో చెప్పారు. సమావేశంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, సర్వే ఏడీ కనకప్రసాద్, తహసీల్దార్ రవి నాయక్, ఈవోఆర్డీ సుమతి, సర్పంచ్‌లు సెక్రటరీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే పూర్తి చేయండి



గుంటుపల్లి లో మ్యాప్ పరిశీలిస్తున్న ఏడీ

బల్లికురవ: భూముల హద్దుకు సంబంధించి జరుగుతున్న రీసర్వే, సమిత్వా సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సర్వే ఏడీ కనకప్రసాద్ కోరారు. గురువారం గుంటుపల్లిలో రీసర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రవినాయక్ డీటీ ప్రహర్ష, ఈవోఆర్డీ సుమతి పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన

చీరాల రూరల్: సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని గ్రామసిరి ఐటీసీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ శాస్త్రి అన్నారు. గురువారం పిట్టువారిపాలెంలో గ్రామసిరి ఐటీసీ బంగారు భవిష్యత్తు ఆధ్వర్యంలో సుస్థిర వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సేంద్రియ వ్యవసాయ సహాయాధికారి టి. మోహన్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భారతి, వీఏ శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

డ్రైవింగ్ ప్రశాంతంగా చేసుకోవాలి



డ్రైవర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్

చీరాల అర్బన్: బస్సు నడిపే సమయంలో డ్రైవర్లు ఎంతో ఏకాగ్రతతో ఉండాలని డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కువ సార్లు ప్రమాదాలు చేసిన డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. డిపో పరిధిలో ఎక్కువ సార్లు ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడామన్నారు. కుటుంబ పరంగా ఏమైన సమస్యలను ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. మానసికంగా ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలన్నారు. బస్సు నడిపే సమయంలో ఏకాగ్రత తప్పితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.